క్లుప్తంగా

బాలుడిపై కుక్కల దాడి



వత్సవాయి: కుక్కల దాడిలో ఓ బాలుడు గాయపడిన సంఘటన సోమవారం వత్సవాయిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..వత్సవాయి గాంధీసెంటర్‌లో నివాసం ఉండే షేక్ ఖాసీం అనే బాలుడు తోటిపిల్లలతో కలిసి ఆడుకుంటుండగా కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. స్థానికులు వెంటనే స్పందించి కుక్కలను వెళ్లగొట్టడంతో పెద్దప్రమాదమే తప్పింది.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు



కీసర(కంచికచర్ల): విద్యుదాఘాతానికి గురైన ఓ సెంట్రింగ్ కూలి గాయపడిన ఘటన కంచికచర్ల మండలం కీసర గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ రాష్ట్రం మధిర గ్రామానికి చెందిన నారాయణ కీసర గ్రామంలో సెంట్రింగ్ పనిచేయడానికి వచ్చాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ ఇంటిపైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణానికి చెందిన ఎనిమిది మందికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోమవారం తన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం రూ.4.90లక్షల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. టీడీపీ నాయకులు మైనేని రాధాకృష్ణ, గింజుపల్లి కృష్ణ, గద్దం రాంబాబు, ఎస్ఎల్‌టీ బాల, గాలం శ్రీను పాల్గొన్నారు.

ప్రజలంతా ఐక్యంగా జీవించాలి

వీరులపాడు: ప్రజలు శాంతి, సామరస్యంతో జీవనం సాగించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. మండలంలోని వీఅన్నవరం గ్రామంలోని ఆర్‌సీయం చర్చిలో మేరీమాత విగ్రహాన్ని సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ వివాదాలకు తావు లేకుండా ప్రజలంతా ఐక్యంగా కలిసిమెలసి జీవించాలన్నారు. అనంతరం గ్రామంలోని కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దొండపాటి కృష్ణారావు, మల్లెల నరసింహారావు, పాపారావు పాల్గొన్నారు.

వరద ఉధృతికి పంట పొలాలు మునక



కంచికచర్ల: కృష్ణానది వరద ఉధృతికి కంచికచర్ల మండలంలోని కునికనపాడు, మున్నలూరు, గనిఆత్కూరు, చెవిటికల్లు గ్రామాల పరిధిలో 100 ఎకరాల్లో పంటలు నీటిమునిగాయి. పులిచింతల నుంచి 7లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో కృష్ణా నదిలో వరదనీరు పోటెత్తింది. ఆదివారం రాత్రి సమయంలో వరద రావడంతో సోమవారం ఉదయానికి పంటపొలాల్లో నీరు చేరాయి. దీంతో ఏటిఒడ్డున ఉన్న పత్తి, మిర్చి, వరి పంటపొలాలు నీటమునిగాయి. ఆయా పంటపొలాల్లో వరదనీరు చేరడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రెండురోజులపాటు వరద నీరు నిల్వ ఉంటే పంట చేతికందదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామంలోని అల్ట్రాటెక్ కర్మాగారంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెలితే.. గ్రామంలోని అల్ట్రాటెక్ కర్మాగారం షట్‌డౌన్‌లో ఉండటంతో సిమెంట్ తయారీ పైపుల వద్ద ఉత్తరప్రదేశ్‌కు చెందిన నలుగురు కార్మికులు మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వారిపై సిమెంట్ పౌడర్ పడటంతో వారు గాయపడ్డారు. అప్రమత్తమైన ప్లాంట్ భద్రతా సిబ్బంది వారిని వెంటనే కర్మాగారంలోని ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా ప్రమాదమే కావడంతో కార్మికులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. నందిగామ ఆర్డీవో బాలకృష్ణ ఆదేశాల మేరకు సోమవారం కర్మాగారంలో రెవెన్యూ, పోలీస్‌లు, డిప్యూటీ పరిశ్రమల శాఖాధికారులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా గతేడాది ఈ కర్మాగారంలో సిమెంట్ మీద పడి ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే.

సరస్వతీదేవి.. నమోస్తుతే..



నందిగామలో సరస్వతీదేవి అలంకారంలో శుకశ్యామలాంబ

నందిగామటౌన్: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో దేవి శరన్నరాత్రుల ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆయా ఆలయాలు, మండపాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవార్లు సోమవారం మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నందిగామలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారు, వాసవీ కన్యకాపరమేశ్వరీ, మరిడీ మహాలక్ష్మి, సాయిఅయ్యప్ప ఆలయంలోని మాలికాపురత్తమ్మ, నెహ్రూనగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలోని పద్మావతి, కనకదుర్గనగర్‌లోని దుర్గామాత, రెవెన్యూ కాలనీలోని అంకమ్మ, భద్రకాళి అమ్మవార్లను భక్తులు సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు, తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని నందిగామ మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారిని ఆలయ అర్చకులు సరస్వతీదేవిగా అలంకరించి మూలమంత్ర హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, ఈవో సీతారావమ్మ, ఆలయ చైర్మన్ మంచాల మాధవరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లింగాలపాడులోని లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారు, పెద్దవరంలోని అంకమ్మ, గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీదేవి, వీరభద్రస్వామి ఆలయంలోని భద్రకాళి, దాములూరు కూడలిలోని రాజరాజేశ్వరీ దేవి, చందాపురం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత, మునగచర్లలోని దుర్గమ్మ, పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞానసరస్వతీ అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు సాగాయి.



పల్లగిరి త్రిశక్తిపీఠంలో నిర్వహించిన సరస్వతీదేవి పూజకు హాజరైన భక్తులు

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, ఫైర్‌స్టేషన్ రోడ్డు, వసంతకాలనీ కమ్యూనిటీ హాల్, శివసాయిక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవార్లను భక్తులు సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని స్కందాదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆయా ఆలయాలు, మండపాల వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కమిటీ సభ్యులు చిన్నారులకు పలక, బలపాలు పంపిణీ చేశారు.శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో 1500 మందికి అన్నదానం చేశారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా జగ్గయ్యపేట మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలు, మండపాల్లో వేంచేసియున్న అమ్మవార్లు సోమవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమలగిరిలోని శివాలయం, ముక్త్యాల భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయం, చిల్లకల్లు, కెఅగ్రహారం, గౌరవరం, బలుసుపాడు గురుధాంలోని అమ్మవార్లను సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించి పలకలు, బలపాలు పంపిణీ చేశారు.



తిరుమలగిరిలో సరస్వతీదేవి అలంకారంలో దుర్గాదేవి

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు సోమవారం మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తూర్పుబజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో భక్తులు శ్రీసరస్వతీ పూజ, కుంకుమ పూజచేశారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేయడంతోపాటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేటఅర్బన్: అమ్మవారి జన్మనక్షత్రం మూల నక్షత్రం సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని ఆయా ఆలయాలలో అమ్మవారు శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో మూలనక్షత్ర హోమాలు, చిన్నారులకు అక్షరభ్యాసాలు చేశారు. సాయంత్రం సువాసినులచే శ్రీచక్రార్చన నిర్వహించారు.అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి, చెరువుబజారులో ఉన్న శ్రీరేణుకాపరమేశ్వరి, ఆనందసాయి, శాంతినగర్‌లోని శ్రీకలకత్తా కాళిమాత, దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లను అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మార్కండేయబజారు, తోటబజారు మండపాల్లో సరస్వతీదేవికి పూజలు నిర్వహించారు.ఆయా ఆలయాలను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తదితరులు సందర్శించి పూజలు చేశారు.



పేట శ్రీరేణుకాపరమేశ్వరి ఆలయంలో శ్రీసరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



పేట శ్రీకనకదుర్గ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఈవో బీహెచ్‌వీఎస్‌ఎన్ కిషోర్‌కుమార్, ఏఈఓ జంగం శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు బి.శ్రీనివాసరావు, పి.వెంకటరమణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తోటచర్ల, పెనుగంచిప్రోలు పాత సినిమాహాల్ సెంటర్‌లో నవరాత్రుల పందిరిలో సరస్వతీపూజ, అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్లను భక్తులు సోమవారం సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు మండపాల వద్ద అక్షరాభ్యాసం చేయించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవార్లను సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని పెద్దాపురంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని భక్తులు సోమవారం సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలాడి గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. అల్లూరులోని సీతారామచంద్ర స్వామి సహిత మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు.



పెనుగంచిప్రోలులో చిన్నారులకు పలకలు అందజేస్తున్న ఈవో కిషోర్‌కుమార్, పాలకవర్గ సభ్యులు




పెద్దవరం: సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న అంకమ్మతల్లి



అల్లూరులో సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న మహాలక్ష్మి అమ్మవారు




సరస్వతీదేవి అలంకారంలో మరిడీ మహాలక్ష్మి అమ్మవారు



భీమవరంలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు



పెనుగంచిప్రోలులో సరస్వతీదేవిగా అమ్మవారు



కంచికచర్లలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



కంచికచర్లలో పూజలు చేస్తున్న విద్యార్థులు

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా

మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అన్యాయ పాలన సాగుతోందని నందిగమ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన డిజిటల్ బుక్ క్యూర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ కూటమి పాలకులు రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తుండటంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ పేరుతో సంచలన నిర్ణయం తీసుకున్నారన్నారు. అందులో భాగంగానే కూటమి ప్రభుత్వ అరాచక పాలనతో అన్యాయానికి గురవుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలిచి రక్షణ కల్పించేందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను రూపొందించారని వివరించారు.

ఏకపక్షంగా పనిచేస్తే భవిష్యత్‌లో ఇబ్బందే...

గ్రామాల్లో కార్యకర్తలు తమకు జరుగుతున్న అన్యాయాన్ని డిజిటల్‌బుక్‌లో నమోదు చేస్తే పార్టీ వారికి అండగా నిలుస్తుందని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ఏకపక్షంగా పనిచేసే అధికారులను చట్టం ముందు నిలబెట్టడం ఖాయమన్నారు. డిజిటల్ బుక్‌పై గ్రామాల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని నాయకులకు సూచించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా అన్నీ ఇచ్చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. హామీలను అమలుచేయాలని కోరేవారిపై కూటమిప్రభుత్వం కేసులు పెడుతుండటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మహ్మద్ మస్తాన్, మంచాల చంద్రశేఖర్, నాయకులు ఓర్సు జ్వాలా, గుడేటి శ్రీనివాసరావు, చింతోటి ప్రసాద్, మాడుగుల మనోహర్, అనుమోలు సారథి పాల్గొన్నారు.

కార్యకర్తలకు కొండంత అండ...

వత్సవాయి: డిజిటల్ బుక్ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు కొండంత అండగా నిలుస్తుందని ఆ పార్టీ మండల కన్వీనర్ గుత్తా శంకరరావు పేర్కొను. వత్సవాయి మండల పార్టీ కార్యాలయలో డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ బుక్ రాస్తే చెరిగేపోయే రెడ్‌బుక్ వంటింది కాదని, చరిత్ర ఉన్నంతకాలం గుర్తుండిపోయే చిరస్థాయిగా అందరికీ గుర్తుంటుందన్నారు. కూటమి పాలనలో దాడులకు గురైన కార్యకర్తలు నేరుగా డిజిటల్‌బుక్‌లో తమకు జరిగిన అన్యాయం, సమస్యలను నేరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. రెడ్‌బుక్ ద్వారా కార్యకర్తలపై అక్రమంగా పెట్టిన కేసులకు డిజిటల్ బుక్ ద్వారా న్యాయమైన పద్ధతిలో సమాధానం చెప్తామని పేర్కొన్నారు. వత్సవాయి గ్రామ పార్టీ అధ్యక్షులు మిట్టకోలు నరేష్, దబ్బాకుపల్లి సర్పంచ్ కొట్టె నగేష్, నాయకులు రూప్లా నాయక్, షేక్ బాజీ, కొలుసు రాంబాబు, చింతల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



వత్సవాయిలో డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గుత్తా శంకరరావు, నాయకులు

డిజిటల్ బుక్‌పై కార్యకర్తలకు అవగాహన...

జగ్గయ్యపేట: కూటమి ప్రభుత్వ ఆగడాలను తప్పకుండా ఎండగడతామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల పార్టీ ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కూటమి ప్రభుత్వ ఆగడాలను డిజిటల్ బుక్‌లో పొందుపరిచేలా నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు, నాయకులు హుస్సేన్, ఇబ్రాయిల్, శివరాత్రి పృథ్వీ, బండి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూడిద నరసింహారావు,శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

బాధితులకు అండగా డిజిటల్ బుక్

పెనుగంచిప్రోలు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, సామాన్య ప్రజలకు డిజిటల్ బుక్‌తో భరోసా లభిస్తుందని వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ, మండల పార్టీ అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు పేర్కొన్నారు. పెనుగంచిప్రోలులో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి సోమ వారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయాందోళనలకు గురి చేస్తున్నారన్నారు. న్యాయస్థానాలు పదేపదే హెచ్చరిస్తున్నా పోలీసులు లెక్క చేయడం లేదన్నారు. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడంద్వారా కూటమి ప్రభుత్వం, అధికారులు చేస్తు న్న అన్యాయాలను తెలుసుకోవచ్చన్నారు. యాప్ లో అప్‌లోడ్ చేసుకోలేనివారు 040-49171718 నంబర్‌కు కాల్‌చేసి నమోదు చేయించుకోవచ్చన్నారు. ప్రజల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా అందుకు కారకులైన వారిని ఈ యాప్ ద్వారా చట్టం ముందు నిలబెడతామని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చేని రాంబాబు, నియోజకవర్గ వాణిజ్య విభాగం, ట్రేడ్ యూనియన్ కన్వీనర్లు దేరంగుల శ్రీనివాసరావు, మెండెం రామారావు, మండల ఉపాధ్యక్షులు జక్కులూరి దేవదాసు, మండల యూత్, ఎస్సీసెల్ అధ్యక్షులు కోయ బాబి, బొడ్డు రవి, గ్రామ పార్టీ అధ్యక్షులు గుడిమెట్ల శంకర్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, మండల, గ్రామ నాయకులు చుంచు బెనర్జీ, మల్లెబోయిన సైదులు, గౌతమ్, వెంకటేష్, బి సాయి, రాంబాబు, నరేష్ పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గాంధీ, పొన్నం కోటేశ్వరరావు, రామారావు తదితరులు

ముగిసిన బతుకమ్మ ఉత్సవాలు

జగ్గయ్యపేటఅర్బన్ : దసరా పండుగ మహోత్సవాలను పురస్కరించుకుని జగ్గయ్యపేటలో ఈ నెల 21వతేదీ నుంచి అంగరంగవైభవంగా సాగుతున్న బతుకమ్మ ఉత్సవాలు ముగిశాయి. చివరిరోజు సోమవారం రాత్రి స్థానిక రేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అందమైన పుష్పాలతో అలంకరించిన బతుకమ్మలను వేదికపై ఉంచి పూజలు చేశారు. గేయాలు పాడుతూ బతుకమ్మ ఆడటంతోపాటు కోలాటం ప్రదర్శించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, రామ్‌కో సిమెంట్స్ సీనియర్ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాస్తవ, మమతా దంపతులు టీడీపీ నాయకులు శ్రీరాం చినబాబు తదితరులు పాల్గొని ఉత్సాహంగా కోలాటం ఆడి ఉత్సాహపరిచారు. బతుకమ్మ అభివృద్ధి కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు కొప్పు అనంతరాజా, తులసి సుబ్బారావు, కమిటీ ప్రతినిధులు నోముల శివకుమార్, యర్రా శ్రీనివాసరావు, చక్కా సుధాకర్, దేవస్థాన కమిటీ సభ్యులు మామిడి సురేష్, రంగాపురం నాగేశ్వరరావు, ఓంకారి ఈశ్వర్, విశ్వనాథ్, నాగేశ్వరరావు, వడేఘర్ వెంకటేశ్వరరావు, మామిడి రాము పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

సర్వే విధుల నుంచి తప్పించాలంటూ ఆందోళన



చిల్లకల్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి సర్వే బాధ్యతల నుంచి తమను తప్పించాలని కోరుతూ మండలంలోని సచివాలయ ఇంజినీరింగ్ ఉద్యోగులు సోమవారం చిల్లకల్లులోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఇంటింటి సర్వే కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం అన్ని సేవలకు తమను వినియోగిస్తోందంటూ ఆవేన వ్యక్తం చేశారు. అదనపు బాధ్యతలు మోపితే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం పునరాలోచించి ఇంటింటి సర్వే బాధ్యతల నుంచి తమను మినహాయించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ప్రశాంతి, తస్లైమా, రామకృష్ణ, శ్రీకాంత్, పూర్ణిమ, శంకర్, సచివాలయ మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అపహరణ

వత్సవాయి: బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిల్చున్న వ్యక్తి నుంచి ఫోన్‌ను అపహరించిన ఘటన వత్సవాయిలో సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు..వత్సవాయి గ్రామానికి చెందిన దుగ్గి బాబి అనేవక్తి గాంధీపార్కు సెంటర్‌లో తన నివాసం ఎదుట నిల్చుని ఫోన్ మాట్లాడుతుండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తమబైక్ స్కిడ్ అయినట్లు నటించారు. కిందపడిపోతున్న వారిని పటుకునేందుకు బాబి యత్నించగా, ఈక్రమంలో వారు బాబి ఫోన్‌ను అపహరించి గుట్టుగా అక్కడ్నుంచి పరారయ్యారు.

చిరు వ్యాపారుల కోసమే లోక్‌కల్యాణ్

జగ్గయ్యపేట అర్బన్: చిరు వ్యాపారులు తమ కాళ్లమీద నిలబడి అభివృద్ధి చెందాలనే సంకల్పంతోనే లోక్ కల్యాణ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. స్థానిక ఉక్కు కళావేదికలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో లోక్ కల్యాణ్ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతగల చిరు వ్యాపారులకు రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు వడ్డీ లేని రుణాలు అందజేయస్తారన్నారు. ఆయా రుణాలను వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మెప్మా పీడీ వెంకట కృష్ణప్రసాద్, టీఎల్ఎఫ్ ప్రెసిడెంట్ నజీమూన్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఇన్‌చార్జ్ సీఎంఎం వెంకట్, కౌన్సిలర్లు, మెప్మా, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.